## సద్గురు శ్రీనాన్న గారి అనుగ్రహభాషణములు, 8-2-03, చించినాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

కొంతమంది శరీరాలు చనిపోయినా వారుచేసిన మంచిపనుల వలన మానవజాతి హృదయాలలో అలా జీవించి ఉంటారు. కొంతమంది జీవించి ఉంటారు, వారి శరీరాలు ఇక్కడే ఉంటాయి కాని ఎవరి హృదయంలోను వారికి స్థానం ఉండదు. జ్ఞానాన్ని ప్రేమను సమన్వయం చేసుకొని జీవించాలి. మనహృదయంలో ఒక సద్వస్తువు ఉంది, దానిని అనుభవంలోనికి తెచ్చుకోవాలి. ఈ జ్ఞానయజ్ఞాలు, సజ్జనసాంగత్యం వీటి యొక్క ప్రయోజనం అదే. జీవితగమ్యాన్ని సాధించటానికి పెంకితనం ఉండకూడదు కాని పట్టుదల ఉండాలి. పెంకితనం వేరు, పట్టుదల వేరు. పట్టుదలఎంత మంచిదో, పెంకితనం అంతచెడ్డది పట్టుదలకుగుర్తు అబ్రహంలింకన్. గొప్ప ఆత్మవిశ్వాసం ఉన్న వ్యక్తి లింకన్. చిన్నప్పడు వ్యాపారంచేస్తే నష్టం వచ్చింది, ఎలక్షన్‌లలో చాలాసార్లు ఓడిపోయాడు. మనం మంచి చేయటానికి ప్రారంభించినపుడు చెడు ఎదురయినా మంచిని విడిచిపెట్టకూడదు. ప్రజలు ఆయనను ఎన్ని సార్లు ఓడించినా ఆయనకు ప్రజలమీద ప్రేమతగ్గలేదు. జరిగేది మనకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా మనడ్యూటీ విషయంలో అంటే మనం చేసే పని విషయంలో అశ్రద్ధచేస్తే జీవితంలో ఓడిపోతాము అని లింకన్ చెప్పాడు. అనేక ఓటమిలు చవిచూసి, జీవితంలో అనేక అనుభవాలు పొంది చివరకు అమెరికా ప్రెసిడెంటు అయ్యాడు. జీవితంలో ఆత్మవిశ్వాసం ఉండాలి ఆత్మవిశ్వాసం లేకపోతే, ధైర్యంలేకపోతే జీవితంలో ఓడిపోతాము. మనకు సహనంలేకపోతే సాత్వికప్రవృత్తి రాదు. సాత్వికప్రవృత్తి లేనివాడు శాంతిగాఉండలేడు, సమాజానికి ఆనందాన్ని ఇవ్వలేడు. సాత్వికప్రవృత్తి ఉన్నవాడు మాత్రమే తాను శాంతిగా ఉంటాడు, ఇతరులకు శాంతిని పంచిపెడతాడు. సాత్వికప్రవృత్తిని మనం ప్రాక్టీసు చెయ్యాలి. తమోగుణం, రజోగుణం, సత్యగుణం ఈ మూడుగుణాలను దాటితే కదా ఈశ్వరసాక్షత్కారం అయ్యేది అని చెపుతారు. కాని మనం సత్వగుణాన్ని విడిచిపెట్టకూడదు. ఎందుచేతనంటే సత్వగుణం ద్వారా మూడుగుణాలను దాటగలము. మనం మనస్సును కాదు పొడిగించుకోవలసింది, సత్వగుణాన్ని పొడిగించుకోవాలి. మనస్సుకు శాంతికావాలంటే ఏ హృదయంలో అయితే భగవంతుడు ఉన్నాడో అక్కడకు నీ మనస్సు ప్రయాణం చేస్తూ ఉంటే దానికి శాంతి దొరుకుతుంది, విశ్రాంతి దొరుకుతుంది. మనకు గమ్యంమీద ఎంత ప్రీతి ఉందో, ఆగమ్యానికి చేరటానికి మనం చేసే ప్రయత్నం మీద కూడా అంత ప్రీతి ఉండాలి, ప్రేమ ఉండాలి, భక్తి ఉండాలి లేకపోతే గమ్యాన్ని మిస్ అయిపోతాము. సర్వదుఃఖాలనుండి మానవుడు విడుదల పొందాలంటే అవి కుటుంబంద్వారా వచ్చినా, సమాజం ద్వారా వచ్చినా, ప్రకృతి ద్వారా వచ్చినా అది ఏరకమైన దుఃఖంఅయినా వాటిలోనుండి విడుదల పొందాలంటే ఒక్కటే ఉపాయం, ఆత్మజ్ఞానాన్ని సముపార్జించాలి. ఇంకోమార్గంలేదు ఆత్మజ్ఞానాన్ని సముపార్జించిన వాడు మాత్రమే సర్వదుఃఖాలనుండి విడుదలపొందుతాడు.

సత్యవస్తువు నీహృదయంలో ఉంది. నీ మనస్సులో ఉన్న తలంపులను, గుణాలను ఆలోచనలను, తింగరతనాన్ని తీసుకొనివెళ్ళి లోపలఉన్న వస్తువుకు రుద్దవద్దు. లోపలఉన్న సత్యవస్తువు గురించి ఊహించవద్దు. దానిని అనుభవంలోనికి తెచ్చుకోవాలి. అది నీకు అనుభవంలోనికి రాకపోతే వదిలెయ్యి అంతేగాని నీతింగరతనాన్ని దానికి రుద్దుకు. నీకు తెలియకపోతే తెలియనట్లు పడిఉండు అంతే గాని నీవికారములను, రాగద్వేషములను, నీ సంకల్పవికల్పాలను తీసుకొనివెళ్ళి సద్వస్తువుకు రుద్దకు. వేదంలో చెపుతారు మనం నిరంతరం స్మరించదగినది, ధ్యానించదగినది, స్తోత్రం చేయదగినది హృదయంలోఉన్న పరమాత్మ ఒక్కటి మాత్రమే. అది రూపరహితం. నామరహితం అది తప్పించి దేనిని స్మరించినా పరిణామంలో నీకు దుఃఖంవస్తుంది. ప్రతీరోజూ మనం అభ్యాసం చేయాలి, ఏరోజు కారోజు మనం సజీవంగా ఉండాలి, ప్రతీరోజును మనం సద్వినియోగం చేసుకోవాలి. నీవు స్వచ్ఛంగా అవ్వాలంటే ఈశ్వరుడు ఎక్కడున్నాడు నీ హృదయంలో ఉన్నాడు, నీమనస్సు ఆయన సమీపంలో ఉంటే నీవు స్వచ్ఛంఅయిపోతావు. నీలో బలహీనతలు ఉన్నా అవి రాలిపోతాయి. ఆయన సాన్నిధ్యంలో ఉన్నప్పడు నీవు భయరహితుడుగా ఉంటావు, నిర్మలంగా ఉంటావు, ప్రకృతిలో ఉన్న ఆటుపోటులు నిన్ను చలింపచేయలేవు. మహాత్ములతోటి, సత్పురుషులతోటి సాంగత్యం చేస్తూఉంటే నీమనస్సులో ఉన్న దోషాలు పోయి అది నిర్మలం అయ్యి గంతులు వేసుకొంటూ, ఉరకలు వేసుకొంటూ నదీప్రవాహంలాగ వేగంగా హృదయంలోనికి పరుగెడుతుంది. మీరు గెంటనక్కరలేదు. మహాత్ముల సాంగత్యంవలన మనస్సు స్వచ్ఛం అయి సంతోషంగా, ఆనందంగా హృదయంలోనికి వెళ్ళి ఐక్యమవుతుంది. ఆ ప్రయాణంలో దానికి ఆటంకాలు వచ్చినా ఒక్క గంతువేసి వాటిని అతిక్రమించి హృదయంవైపుకు వెళ్ళిపోతుంది. మనస్సుకు సత్వగుణంవచ్చి నపుడు అది వేగంగా హృదయంవైపు ప్రయాణంచేస్తుంది అందువలన సత్వగుణాన్ని కాపాడుకో, దానిని పెంచుకో, దానిని పోషించుకో. హృదయంలోనుండి మనస్సు సహస్రారానికి వచ్చినప్పడు దేహంతో తాదాప్యం వస్తోంది. అని అడిగితే వస్తుంది అది సంభవమే అంటున్నారు భగవాన్. అభ్యాసం వలన ఆతాదాప్యం క్రమేపి తగ్గిపోతుంది. మరల హృదయంలోనికి మనస్సును పంపటంవలన దేహంతో తాదాప్యం పోతుంది. జీవితంలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి,

అనేకరకాల మనుషులు తారసపడతారు. అసంఘటనల ద్వారా, మనుషులద్వారా మనం పాఠాలు నేర్చుకొంటూ అక్కడ ఆగిపోకుండా ముందుకు ప్రయాణం చెయ్యాలి.

మనకు ఎప్పుడైనా అశాంతి వస్తుంటే భగవంతుడు మనలను విడిచిపెట్టేసాడా అని మనకు అనిపిస్తుంది. మనకు శాంతివస్తే భగవంతుడు మనలను స్మరించుకొంటున్నాడు లేకపోనా ఇంత శాంతి మనకు ఎలా వస్తుంది అనిపిస్తుంది. భగవంతుడు మనలను ఆయన వడిలోనికి తీసుకొంటే శాంతి, తీసుకోకపోతే అశాంతి మీరు ఎప్పుడైనా ఆనందంలో ఊగిసలాడుతూ ఉంటే భగవంతుడు మనలను తీసుకొన్నాడు, ఆయన అనుగ్రహం మనమీద పనిచేస్తోంది అని అర్థం లేకపోతే అంత అలౌకికమైన శాంతి మనకు దొరకదు. మీకు ఎప్పుడైనా అనుభవాలు వస్తూ ఉంటాయి. కాని అవి నిలబడవు. ఆత్మానుభవం శాశ్వతం అవ్వాలంటే వాసనలు వేరుతో సహానశించాలి కొంతమందికి సాధన ప్రారంభించిన వెంటనే వాసనలు నశిస్తాయి. కొంతమందికి ఎంత సాధనా చేసినా వాసనలు నశించవు అంటే భగవంతుడికి ఒకరిమీద ఇష్టం, ఒకరి మీద అయిష్టంఅనికాదు, పూర్వజన్మలో ఎవరైతే సాధనచేసి ఈజన్మ లోనికి వచ్చారో వారికి అతి తొందరగా వాసనానాశనం అవుతుంది. వారు మనకు ఆప్తులు, వీరు మనకు ఆప్తులు అని అనుకొంటాము కాని భగవంతుడిని మించిన ఆప్తుడు మనకు లేడు, గురువును మించిన ఆప్తుడు లేడు మనకు భగవంతుడిని మించిన ఆప్తుడు ఈసృష్టిలో ఎవడూలేడు అందుచేత భగవంతుడు ఒక మాట చెపితే దానిని ఆప్తవాక్యం అంటారు ఎవరైతే మనక్షేమంకోరుతున్నారో వారు చెప్పిన మాటను తీసివేయకూడదు, దానికి గౌరవం ఇవ్వాలి సాధనాబలం లేనివారు, పుణ్యబలం లేనివారు అది గుర్తించలేరు. భగవంతుడు చెప్పిన మాటల గురించి మనకు తెలియనప్పడు మనకు అర్థంకావటం లేదు అనుకోవాలి అంతేగాని ఆమాటలు అసత్యం అనుకోకూడదు. ఎంతోకొంత సాధన చేస్తున్నాను, సాధనలో అభివృద్ధి అవుతున్నట్లు నాకు ఎలా తెలుస్తుంది అని అడుగుతున్నారు. మీ అభివృద్ధిని మీరు కొలుచుకోవటం కష్టం, నీలో రాగద్వేషములు తగ్గాలి, తలంపులవేగం తగ్గాలి, సంకల్పవికల్పాలు తగ్గుతూ ఉండాలి అప్పడు నీవు అభివృద్ధి చెందుతున్నట్లు లెక్క, మనం అదిసాధించాము, ఇది సాధించాము అనుకొంటాము చేయించినవాడు ఈశ్వరుడే, మనం ఇలా అనుకోవటం వలన మనస్సు పొడిగింపబడుతుంది. మనవల్ల ఏదైనా మంచిపని అయ్యింది అనుకోండి ఈ దేహాన్ని ఈశ్వరుడు ఉపయోగించుకొన్నాడు, చేసేది ఈశ్వరుడే, ఒక్కో సంఘటన నీకు ఇష్టం ఉంటుంది, ఒక్కో సంఘటన నీకు ఇష్టం ఉండదు. ఇవి అన్నీ భగవంతుడిలోనే జరుగుతున్నాయి, అని నీకు తెలిస్తే దుఃఖంచల్లారిపోతుంది. వివేకంలేనివారు,





ఆలోచనలేనివారు, తెలివితక్కువవారు విషయాల నుండి ఆనందంపొందటానికి ఎలా ప్రయత్నం చేస్తారో వివేకవంతులు, తెలివిగలవారు ఆత్మనుండి ఆనందం పొందటానికి అలా ప్రయత్నం చేస్తారు అని ప్రహ్లాదుడు చెప్పాడు. వివేకహీనుడికి విషయాలమీద ఎంతప్రీతి ఉంటుందో వివేకవంతుడికి సద్వస్తువు మీద అంతప్రీతి ఉంటుంది, దానిని పొందాలనే కాంక్ష అంత ఉంటుంది. ఇది వివేకవంతుడి లక్షణం, అది వివేకహీనుడి లక్షణం స్వార్థరహితుడికి, భయరహితుడికి, ద్వేషరహితుడికి మాత్రమే ఆత్మానందం అందుతుంది. జ్ఞానసంపదలేనివారిని, వినయసంపదలేని వారిని లోకం గుర్తించిన ప్రభువు గుర్తించడు. గౌరవము, పేరుప్రతిష్టలు ఇవిఅన్నీ లోకం ఎంతనిజమో, నీ మనస్సు ఎంతనిజమో అవి కూడా అంతేనిజం, ప్రభువు దృష్టిలో వాటికి అర్థంలేదు మనం ఏదైనా ఒకమాట మాట్లాడుతున్నాము అనుకోండి, ఏదైనా ఒక రచన చేసాము అనుకోండి అందులో సందేశం ఉండాలి. మనకు వినేవారి పట్ల, చదివేవారిపట్ల ప్రేమ ఉండాలి, ఆప్యాయత ఉండాలి, లేకపోతే అటువంటి ప్రసంగాలు అనవసరం, అటువంటి రచనలు అనవసరం. నీ మాటద్వారా గాని, చేత ద్వారాగాని మనస్సును పొడిగించుకోకూడదు. జరిగిపోయిన గొడవలు తలపెట్టుకోవటం వలన మనస్సు పొడిగింపబడుతుంది, దేహమేఆత్మ అనే భావన బలపడుతుంది. నీకు ఎన్ని కష్టాలు వచ్చినా కంగారుపడవద్దు. ఈ కష్టాలు ఎవరికి వస్తున్నాయి అనే ప్రశ్న వేసుకో. నీ దృక్పదం మార్చుకొంటే కష్టంలేదు, కష్టం సుఖంగా మారిపోతుంది. మనం ఏదీ నెగిటివ్‌గా చెప్పకూడదు. పాజిటివ్‌గా చెప్పటం వలన మన చైతన్యస్థాయి పెరుగుతుంది, సమస్య పరిష్కారం అవుతుంది, నేను ఎవడను అనే ప్రశ్న ఎందుకు అంటే నేనుఎవడను అనే ప్రశ్నలో ఒక నేను ఉంది, ఆ నేనును తొలగించుకోవటానికే నేనుఎవడను అనే ప్రశ్న.

చటోపాధ్యాయ ఒక పిడత గురించి వ్రాసారు. పిడత అంటోంది నేను మట్టిని, నన్ను కాల్చి పిడత క్రింద చేసారు. నాకు ఒక రూపం వచ్చింది. నన్ను అందరూ పిడత, పిడత అంటున్నారు అంటే నాకు ఒక నామం వచ్చింది. పిడతగా ఉండటం నాకు ఇష్టంలేదు. పిడత చాలా బాగుంది అని అందరూఅంటున్నారు కాని సుఖంలేనప్పడు అందరూ బాగుంది అంటే మాత్రం నాకు ఎందుకు. నేను మట్టిగా అయ్యేవరకు నాకు సుఖంలేదు, ఆనందంలేదు అంటోంది పిడత. ఇక్కడ ఒక విషయం గ్రహించాలి. అది పిడతగా ఉన్నప్పడు కూడా అది మట్టిగానే ఉంది. కాని దానికి మట్టితో తాదాప్యం లేదు. ఆ రూపంతో తాదాప్యం ఉంది, పిడత అనే పేరుతో తాదాప్యం ఉంది. ఆ రూపనామములు ఉన్నప్పడు కూడా అది మట్టిగానే ఉంది. మట్టిలేకపోతే పిడతలేదు. అది పిడత అనే రూపంగా, నామంగా ఉన్నప్పడు కూడా

మట్టితో తాదాప్యం పొందుతూ ఉంటే ఈ నామరూపములు దానిని బంధించవు. అలాగే మనం కూడా ఈ నామరూపములలో ఉన్నప్పటికి వీటికి ఆధారముగా ఉన్న బ్రహ్మముతో తాదాప్యం పొందుతూ ఉంటే ఈ నామరూపములు మనలను బంధించవు. నేను మట్టిలో ఎప్పుడు కలిసిపోతాను, నేను ఎక్కడనుండి వచ్చానో అక్కడకు వెళ్లేవరకు నాకు సుఖంలేదు, శాంతి లేదు అని పిడత అంటున్నప్పటికి అలా అనేటప్పుడు కూడా అది మట్టిలోనే ఉంది. మట్టిలో ఉండి మట్టికి వేరుగా ఉన్నాను అనుకొంటోంది. మనం కూడా అంతే బ్రహ్మంలో ఉండి బ్రహ్మంకు వేరుగా ఉన్నాము అనుకొంటున్నాము. ఈ తలంపువలన లక్షలాదిజన్మలు సఫరింగ్‌కు గురి అవుతున్నాము. ఆ వేరుభావన, భిన్నభావన వలన, ఆ చిన్నతలంపువలన కొన్నివేల తలంపులు వచ్చేస్తున్నాయి. పిడత మట్టిలో ఉండి మట్టి కంటే వేరుగా ఉన్నాను అనుకొంటోంది. అలాగే మనం కూడా బ్రహ్మంలో ఉండి బ్రహ్మంకు వేరుగా ఉన్నాము అనుకొంటున్నాము. మనం బ్రహ్మంకు భిన్నంగా లేము, భిన్నంగా ఉన్నాము అనే తలంపును ఆధారం చేసుకొని అనేక తలంపులు వచ్చి లక్షలాది జన్మలకు గురి అవుతున్నాము. సజ్జన సాంగత్యం వలన, ధ్యానం వలన ఇది తెలుస్తుంది. ఎక్కడయితే రూపం ఉందో అక్కడ దుఃఖం వెంటాడుతుంది. అందుకే ఆ పిడతకు దుఃఖం విడిచిపెట్టటంలేదు. పిడత బాగుంది అని మీరు అంటున్నారు కాని నాగోల, నా అశాంతి మీకు తెలియటంలేదు. నేను ఇలా ఉండను, మట్టిని అయిపోతాను, మట్టిగా ఉన్నప్పడే బాగున్నాను, నన్ను కాల్చి పిడత క్రింద తయారు చేసారు, అప్పటినుండి అశాంతి ప్రారంభమయ్యింది అంటోంది పిడత. లక్షపిడతలు ఉన్నా అవి మట్టికంటే వేరుగా లేవు. అలాగే ఎన్నికోట్ల జనాభా ఉన్నా కూడా వారు భగవంతుడికి భిన్నంగా లేరు, భిన్నంగా లేరు కాబట్టి నువ్వు అందరిలోను భగవంతుడినే చూడు. భగవంతుడిలో ఐక్యం అవ్వటానికి అదొక మార్గం. ఎక్కడ నుండి వచ్చానో అక్కడకు వెళ్లేవరకు నాకు శాంతి లేదు అంటోంది పిడత. ఎక్కడ నుండి వచ్చిందోఅది అక్కడే ఉంది కాని దానికి ఒక రూపం వచ్చింది, నామం వచ్చింది అంతే తేడా. పిడత మట్టిగా నిజం. రూపంగా నామంగా అబద్ధం. మనం కూడా బ్రహ్మంగా నిజం. రూపంగా, నామంగా అబద్ధం. ఈ తేడా తెలిస్తే ఇప్పడు కూడా మనం బ్రహ్మంగానే ఉన్నాము అని తెలుస్తుంది. అయితే మనం బ్రహ్మంగా ఉంటే ఎందుకు అశాంతి వస్తోంది? బ్రహ్మంకు భిన్నంగా ఉన్నాము అనుకోవటంవలన అశాంతి వస్తోంది. మట్టికి భిన్నంగా ఉన్నాను అని పిడత ఎలా అనుకొంటోందో అలాగే మనం కూడా బ్రహ్మంకు భిన్నంగా ఉన్నాము అని అనుకొంటున్నాము. ఆ చిన్నతలంపువలన అనేకవేల తలంపులు వచ్చి అజ్ఞానంలో, అశాంతిలో కూరుకొనిపోతున్నాము. పిడతా, పిడతా ఎంత అందంగా ఉన్నావు, ఎంత ఎర్రగా ఉన్నావు అని మీరు అంటున్నారు కాని మట్టిగా ఉన్నప్పుడు ఉన్న ఆనందం ఇప్పడు నాకు రావటం లేదు అంటోంది పిడత. ఎందుచేత రావటంలేదో చెప్పండి. అది ఇప్పడు కూడా మట్టిగానే ఉంది కాని దానికి మట్టితో తాదాప్యం పోయింది. రూపంతోటి, నామంతోటి తాదాప్యం వచ్చేసింది. ఎంత తాదాప్యం వచ్చేసింది అంటే మట్టిలో ఉన్నాను అన్నసంగతి కూడా మర్చిపోయింది. ఎక్కువ కాల్చేసి నాకు రంగు కల్పించారు. కల్పితంలోనుండి ఆనందం రాదు, శాంతి రాదు, ఎక్కువగా దానిని కాల్చినా, దానికి మంచి రంగు వచ్చినా దానికి మట్టితో తాదాప్యం ఉంటే అప్పడు కూడా ఇబ్బంది లేదు. కాని దానికి రంగుతోటి, నామంతోటి తాదాప్యం వచ్చేసింది. సహజంగా అది మట్టే. కాని నేను మట్టిని కాదు, పిడతను అని వేరుభావన వచ్చేసింది. అందువలన మట్టిలో ఉన్నప్పటికి దుఃఖం అనుభవిస్తోంది. పిడతగా ఉన్నప్పడు కూడా అది మట్టిలోనే ఉంది. అది ఏమట్టిగా ఉందో దానితో తాదాప్యం లేదు అందువలన దానికి ఆనందం అందటం లేదు. మన పరిస్థితి కూడా అంతే. జీవుడికి ఈశ్వరుడికి ఎంతదూరం ఉంది అంటే పిడతకు మట్టికి ఎంతదూరం ఉందో, సినిమా తెరకు బొమ్మకు ఎంతదూరం ఉందో జీవుడికిఈశ్వరుడికి అంతే దూరం ఉంది. జీవుడు ఎక్కడ ఉన్నాడు. ఈశ్వరుడు ఎక్కడ ఉన్నాడు? ఇద్దరూ ఒకేచోట ఉన్నారు. పిడత మట్టిలో ఉన్నప్పటికి దాని తలంపులు, ఆలోచనలు, సంకల్పవికల్పాలు దానిని మట్టికి దూరం చేస్తున్నాయి. నేను మట్టికి దూరమయిపోయాను అనుకొనేది కూడా తలంపే. అదే అశాంతిని తీసుకొని వస్తోంది. ఏ తలంపు అయితే అశాంతిని తీసుకొని వస్తోందో దానిని తీసి ఒక ప్రక్కన పెట్టు. నేను మట్టిలో కలవాలి అనుకొనేటప్పడు కూడా పిడత మట్టిలోనే ఉంది. మనం కూడా బ్రహ్మంలో ఐక్యం అవ్వాలి అనుకొంటున్నాము కదా మరి ఇప్పడు ఎక్కడ ఉన్నాము బ్రహ్మంలోనే ఉన్నాము. పిడతను బలవంతంగా ముక్కలు చేయనక్కరలేదు. అది పిడతగా ఉన్నప్పడే దానికి ఉన్న రంగుతోటి, రూపంతోటి తాదాప్యం మానివేస్తే అది మట్టిగానే ఉంటుంది. మనం కూడా అంతే. ఈ శరీరం చనిపోనక్కరలేదు. శరీరం ఉండగానే నామరూపములతో తాదాప్యం వదిలేస్తే మనం కూడా బ్రహ్మంగానే ఉండవచ్చు. మనకు రూపంతోఉన్నతాదాప్యం, నామంతోఉన్న తాదాప్యం విడిచిపెడితే లోపలఉన్న జ్ఞానం తాలుక వైభవం ఇప్పడే, ఈక్షణంలోనే అనుభవంలోనికి వస్తుంది.

20-02-2003



రమణ భాస్కర

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 23,24-2-2003 | ఆది, సోమ | గీతామందిరం |
| 26-02-2003 | బుధవారం | శివదేవుని చిక్కాల |
| 01-03-2003 | శనివారం | చించినాడ శివాలయం (శివరాత్రి) |
| 02-03-2003 | ఆదివారం | యానాం |
| 09-03-2003 | ఆదివారం | పాలకొల్లు క్షత్రియ కళ్యాణ మండపం |
| 12-03-2003 | బుధవారం | జిన్నూరు శ్రీ రమణక్షేత్రం |
| 15-03-2003 | శనివారం | ఆత్రేయపురం |

## శ్రవణం, మననం, నిధిధ్యాస

సత్యాన్వేషణ ద్వారా స్వరూపానుభూతిని పొందుటకు మనము చేసే ప్రయత్నంలో శ్రవణ, మనన, నిధిధ్యాసలు లక్ష్యసాధనకు, విజయానికి సోపానాలు.

శ్రవణం : మన స్వరూపమైన ఆత్మ సిద్ధవస్తువు, అనగా కేవలము ఉన్నదే ఆత్మ. అట్టి స్వరూప జ్ఞానాన్ని అందించే వారే గురువు. గురువు వద్ద 'ఆత్మ తత్వాన్ని' శ్రద్ధగా, వినయంగా, ప్రేమ పూర్వకంగా, కపటం లేకుండా శ్రవణం చేయాలి. గురువు బోధించిన విషయాన్ని చక్కగా గ్రహించి, ఆ మాటలలోని రసాన్ని, సారాన్ని అనుభవించాలి. ఆత్మజ్ఞాన సముపార్జనలో అవగాహన ముఖ్యం. ఆ పరమస్థితిని పొందుటకు దేనిని విడిచిపెట్టాలో సరియైన అవగాహన కావాలి. వ్యక్తిభావనను విడిచిపెట్టాలి, ఆత్మగా ఉండాలి.

మననం : గురువు వద్ద శ్రవణం చేసిన విషయాన్ని అనేక పర్యాయాలు తలపెట్టుకోవడం మననం. మననం వలన గురువు యొక్క బోధ మన బుద్ధిలో ధృడమై, స్థిరపడుతుంది. అప్పుడు దానిని అనుభవంలోనికి తెచ్చుకోవాలి. 'సత్సంగము' వలన శ్రవణ, మననములు చక్కగా జరిగి మనస్సుకు దారుఢ్యం వస్తుంది, వివేకం పెరుగుతుంది.

నిధిధ్యాస : నిధి అనగా స్వరూప ఆత్మ; ధ్యాస అనగా స్వరూపము నందు నిష్ఠ కలిగియుండుట. నేతిధార వలె నిరంతరం ఆటంకంలేని స్వరూపచింతనను నిధిధ్యాస అంటారు. నిరంతరము ఆత్మను చింతించుట వలన అదే మనము అవుతాము. సాక్షాత్తుగా ఉన్న ఆత్మను ప్రత్యక్షానుభవం ద్వారా గ్రహిస్తాము. అప్పుడు అజ్ఞానదృష్టి నష్టమై ప్రజ్ఞాదృష్టి లభిస్తుంది.

**చావలి సూర్యనారాయణ మూర్తి**
**టీచర్ - అమలాపురం**

## పాలకొల్లు సరస్వతి శిశుమందిర్‌లో గ్రంధాలయ భవన శంకుస్థాపన



ది॥ 6-2-2003న శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల నందు ఉదయం గం॥ 9-04ని॥లకు గ్రంధాలయము భవన నిర్మాణ నిమిత్తం సద్గురు శ్రీ నాన్నగారిచే శంకుస్థాపన కార్యక్రమము జరుపబడినది. గ్రంధాలయ భవన నిర్మాణ నిమిత్తం డా॥ చుండూరి మల్లిఖార్జున గుప్త గారు లక్ష రూపాయలు విరాళముగా ఇచ్చియున్నారు. ఈ కార్యక్రమములో శ్రీ పెన్మెత్స శ్రీరామరాజు మరియు పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు శ్రీ బుద్దా లక్ష్మీనర్సింహరావు, శ్రీ పెనుగొండ వీరభద్రరావు, శ్రీ బోడా సత్యజిత్ కుమార్, శ్రీ శీలంశెట్టి రంగారావు, శ్రీ సరస్వతీ విద్యాపీఠం గోదావరి సంభాగ్ అధ్యక్షులు శ్రీ గోడుగులూరి లక్ష్మణరావు పాల్గొన్నారు.

శంఖుస్థాపన కార్యక్రమం అనంతరం వసంత పంచమి సందర్భముగా ఏర్పాటు చేసిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమములో శ్రీ నాన్నగారు చిన్నారులకు అక్షరాభ్యాసము చేయించారు.



ది॥ 6-2-2003 సం॥రం గురువారం ఉ॥ గం॥ 9-30ని॥లకు సద్గురు శ్రీ నాన్నగారి అమృత హస్తాలతో పాలకొల్లు బొండాడ వారి వీధి నందు ఎ.సి.లు, కంప్యూటర్లు గల "సాయిశంకర్ ఏజన్సీస్" ప్రారంభోత్సవం సుభప్రదంగా జరిగినది. శ్రీ అల్లు వెంకటసత్యనారాయణ,M.L.A., గారు వ్యాపార ప్రారంభోత్సవము చేయగా శ్రీ మరిడి ప్రభాకర్ గారు ప్రధమ కొనుగోలు చేసియున్నారు.